అదానీ బొగ్గు అక్రమాలపై దర్యాప్తు!

- విజిలెన్స్‌కు తమిళ నాడు ప్రభుత్వం అనుమతి
- బొగ్గు దిగుమతుల్లో 3 వేల కోట్ల అక్రమాలు!
- అదానీకి అనుకూలంగా టెండర్ నిబంధనలు
- మార్కెట్ ధర కంటే అధికంగా చెల్లింపులు
- నాణ్యత లేని బొగ్గు సరఫరా చేసినట్టు ఆరోపణలు

చెన్నై, జూలై 2: అదానీ గ్రూప్ నుంచి చేసుకున్న బొగ్గు దిగుమతుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై విచారణ జరిపేందుకు డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ-కరప్షన్(డీవీఏసీ)కు తమిళనాడు ప్రభుత్వం అనుమతించింది. 2012 - 2016 మధ్య జరిగిన బొగ్గు దిగుమతుల్లో రాష్ట్రానికి రూ.3 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లిందనే ఆరోపణల నేపథ్యంలో స్టాలిన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో అక్రమాల నిగ్గు తేల్చేందుకు డీవీఏసీ దర్యాప్తు ప్రారంభించింది. అదానీకి అనుకూలంగా టెండర్ల నియమాల్లో మార్పులు జరిగాయని, మార్కెట్ ధర కంటే అదానీ గ్రూపునకు ఎక్కువ ధర చెల్లించి బొగ్గు దిగుమతి చేసుకున్నారనే ఆరోపణలపై డీవీఏసీ దర్యాప్తు చేపట్టనుంది.

బొగ్గు దిగుమతిపై ఆరోపణలు

తమిళనాడులో 2012 - 2016 మధ్య విద్యుత్తు ఉత్పత్తి కోసం తమిళనాడు విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా సంస్థ అయిన తమిళనాడు జెనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్(తంగెడ్కో).. అదానీ గ్లోబల్ సంస్థ ద్వారా బొగ్గును దిగుమతి చేసుకుంది. అయితే, ఈ ఒప్పందంలో అనేక అక్రమాలు జరిగాయని అరప్పోర్ ఇయక్కమ్ అనే సంస్థ కన్వీనర్ జయరామ్ వెంకటేశన్ ఆరోపిస్తూ వస్తున్నారు. రూ.6,066 కోట్ల విలువైన ఈ ఒప్పందంలో దాదాపు రూ.3,000 కోట్ల మేర అదానీ గ్లోబల్ సంస్థ అక్రమాలకు పాల్పడిందని జయరామ్ ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై విచారణ జరిపించాలని గత ఏడాది జనవరి 31న ముఖ్యమంత్రి స్టాలిన్‌కు లేఖ రాశారు.

టెండర్ నియమాలు మార్చారు.. ధర పెంచేశారు

అదానీ గ్లోబల్‌కు అనుకూలంగా 2011లో టెండర్ నియమాలు మార్చేశారని, కాగ్ కూడా ఈ అంశాన్ని గుర్తించిందని జయరామ్ ఆరోపిస్తున్నారు. టెండర్‌లో పాల్గొనే సంస్థ టర్నోవర్ రూ.100 కోట్లు ఉండాలనే నిబంధనను మార్చి రూ.1,000 కోట్లకు పెంచారని కాగ్ చెప్పినట్టు ఆయన పేర్కొన్నారు. మెట్రిక్ టన్ను బొగ్గుకు 15-20 డాలర్లు వరకు మార్కెట్ ధర కన్నా అదానీ గ్లోబల్‌కు ఎక్కువగా చెల్లించినట్టు జయరామన్ చెప్పున్నారు. పైగా అదానీ గ్లోబల్ నాణ్యమైన బొగ్గు దిగుమతి చేయలేదని, ఫలితంగా విద్యుత్తు ఉత్పత్తి సరిగ్గా జరగకపోవడం వల్ల రాష్ట్రానికి మరింత నష్టం వచ్చినట్టు ఆరోపిస్తున్నారు.

విచారణ కోసం పట్టు వదలని ప్రయత్నం

అదానీ నుంచి బొగ్గు దిగుమతి ఒప్పందంపై విచారణ కోసం జయరామ్ పట్టు వదలకుండా ప్రయత్నిస్తున్నారు. ఈ ఒప్పందంపై విచారణకు ప్రభుత్వం అనుమతించడం లేదని, కాబట్టి అసెంబ్లీలో నిరసన తెలిపేందుకు అవకాశం ఇవ్వాలని జూన్ 26న అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ రాశారు. దీంతో విచారణ జరిపేందుకు డీవీఏసీకి తమిళనాడు ప్రభుత్వం ఆదేశించింది. తంగెడ్కో చేసుకున్న బొగ్గు దిగుమతుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ప్రాథమిక విచారణ జరిపేందుకు ప్రభుత్వం అనుమతించినట్టు డీవీఏసీ అధికారులు చెప్పినట్టు 'ది హిందూ' పేర్కొన్నది. అరప్పోర్ ఇయక్కమ్ సంస్థ ఫిర్యాదు మేరకు అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్టు అధికారులు మంగళవారం తెలిపారు.

సత్సంగ్‌లో తొక్కిసలాట

116 మంది మృతి

యూపీలోని హాథ్రస్‌లో పెను విషాదం

- 'భోలే బాబా' ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఘోరం
- బాబా పాదాలు తాకేందుకు భక్తుల పోటీ
- ఒక్కసారిగా తొక్కిసలాట.. కింద పడ్డ ప్రజలు
- గాయాలు, ఊపిరి అందక అక్కడికక్కడే మృతి

హత్రాస్, జూలై 2: ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్‌లో ఆధ్యాత్మిక కార్యక్రమం అంతులేని విషాదాన్ని మిగిల్చింది. 116 మంది మరణాలకు కారణమైంది. భోలే బాబా అనే పేరుతో ప్రాచుర్యం పొందిన ఓ ఆధ్యాత్మికవేత్త హత్రాస్ జిల్లాలోని ఫుల్‌రాయ్ గ్రామంలో మంగళవారం 'సత్సంగ్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా భక్తులు, అనుచరులు హాజరయ్యారు. వారిని ఉద్దేశించి భోలే బాబా తన ప్రవచనాన్ని ఇచ్చారు. కార్యక్రమం పూర్తవుతుండగా ఒక్కసారిగా పెనుగులాట చోటుచేసుకుంది. అనేక మంది కింద పడిపోయారు. ప్రాణాలు కాపాడుకునేందుకు బయటకు పరుగులు తీశారు. ఈ క్రమంలో కింద పడ్డ వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఊపిరి అందక ఆర్తనాదాలు చేస్తూ చాలా మంది అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. పోలీసులు, స్థానికులు ఈ ఘటన నుంచి తేరుకొని సహాయక చర్యలు ప్రారంభించేటప్పటికీ తీవ్ర ప్రాణనష్టం సంభవించింది. 89 మంది ఘటనా స్థలంలో విగతజీవితులుగా పడి ఉన్నారు. గాయపడ్డ వారిని ట్రక్కులు, టెంపోల్లో స్థానికంగా ఉన్న సికందర రావు ట్రామా సెంటర్ దవాఖానకు తరలించారు. వీరిలోనూ మరో 27 మంది మరణించారు. మొత్తం 116 మంది మరణించినట్టు అలీగఢ్ రేంజ్ ఐజీ శలభ్ మాథుర్ తెలిపారు. మృతుల్లో 23 మంది మహిళలు ఉన్నట్టు గుర్తించారు. పలువురు చిన్నారులు కూడా ఉన్నారు. మరికొందరు పరిస్థితి విషమంగా ఉంది.

పాదాలను తాకే ప్రయత్నంలోనే..

సత్సంగ్ ముగుస్తుండగా తొక్కిసలాట చోటు చేసుకుందని ప్రత్యక్ష సాక్షులు చెప్పున్నారు. భోలే బాబా వెళ్తుండగా ఆయనను దగ్గరగా దర్శనం చేసుకునేందుకు, ఆయన పాదాలు తాకేందుకు, ఆయన పాదాలు తాకిన మట్టిని తీసుకునేందుకు భక్తులు పోటీ పడ్డారని తెలుస్తున్నది. ఈ క్రమంలోనే తొక్కిసలాట జరిగిందని చెప్పున్నారు. కార్యక్రమానికి నిర్వాహకులు సరైన ఏర్పాట్లు చేయలేదని, ఊహించిన దాని కంటే ఎక్కువ భక్తులు రావడం, కార్యక్రమం జరిగిన ప్రాంతంలో నేల చిత్తడిగా మారడం కూడా తొక్కిసలాటకు కారణమని పలువురు తెలిపారు. కాగా, ఈ ప్రైవేటు కార్యక్రమం బయట స్థానిక అధికార యంత్రాంగం భద్రతా ఏర్పాట్లు చేసిందని, లోపల మాత్రం నిర్వాహకులే ఏర్పాట్లు చేసుకున్నారని జిల్లా మెజిస్ట్రేట్ ఆశిశ్ కుమార్ తెలిపారు.

మృతులకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా

హాథ్రస్ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. మృతులకు పీఎం నేషనల్ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్టు, గాయపడ్డ వారికి రూ.50 వేల చొప్పున ఇవ్వనున్నట్టు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కూడా ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.

బస్‌లో ఉంచిన కొందరు భక్తుల మృతదేహాలు

ఎవరీ భోలే బాబా?

'భోలే బాబా' అసలు పేరు నారాయణ్ సాకార్ హరి. తనను తాను దేవుడికి శిష్యుడిగా ప్రకటించుకొని ఆధ్యాత్మిక ప్రసంగాలు ఇస్తుంటాడు. ఇతడి స్వస్థలం యూపీలోని ఈటా జిల్లాలో బహదూర్ గ్రామం. గతంలో తాను ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ)లో పనిచేశానని, ఆధ్యాత్మిక జీవితం కోసం 26 ఏండ్ల క్రితం ఉద్యోగాన్ని వదిలేశానని చెబుతుంటాడు. ఆయన అనుచరులు అలీగఢ్‌లో ప్రతి మంగళవారం సత్సంగ్ నిర్వహిస్తుంటారు. కాషాయ వస్త్రాలు ధరించకుండా, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ.. ఆధ్యాత్మిక ప్రసంగాలు చేయటం ఈయన స్టైల్! ఖరీదైన అద్దాలు, తెల్లని సూట్, టై ధరించి ఈయన నిర్వహించే 'సత్సంగ్' కార్యక్రమాలకు పశ్చిమ యూపీలో భక్తులు పెద్ద ఎత్తున ఉన్నారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీతోపాటు దేశవ్యాప్తంగా 'భోలే బాబా'కు లక్షల మంది అనుచరులు ఉన్నారు.

వారంలోగా స్పందించండి

కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై సీబీఐకి ఢిల్లీ హైకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, జూలై 2: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సీబీఐ తనను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు మంగళవారం సీబీఐకి నోటీసు జారీ చేసింది. వారం రోజుల్లో స్పందన తెలియజేయాలని సీబీఐని ఆదేశించింది. వారు సమాధానం ఇచ్చిన తర్వాత దానిపై ఏమైనా అభ్యంతరాలుంటే కేజ్రీవాల్ కౌన్సిల్ రెండు రోజుల తర్వాత రిజాయిండర్ దాఖలు చేయవచ్చునని పేర్కొంటూ కేసును జూలై 17కి వాయిదా వేసింది. కాగా, తీహార్ జైలులో ఉన్న కేజ్రీవాల్‌ను జూన్ 26న సీబీఐ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

వందేభారత్‌లో లీకేజీ

వారణాసి, జూలై 2: మోదీ సర్కారు హయాంలో 'లీకేజీ'లు ఆగడం లేదు. బీజేపీ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే ప్రీమియం వందేభారత్ రైళ్లలోనూ నీళ్లు లీక్ అవుతున్నాయి. ఢిల్లీ-వారణాసి మధ్య మంగళవారం ప్రయాణిస్తున్న ఓ రైలు కోచ్‌లో నీళ్లు లీక్ కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నీళ్లు లీక్ అవుతున్న వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ రైల్వే శాఖకు ఫిర్యాదు చేశారు. దీనికి ఉత్తర రైల్వే స్పందిస్తూ.. పైపులు బ్లాక్ కావడం వల్లే నీళ్లు లీక్ అయినట్టు తెలిపింది.

లోక్‌సభ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ, జూలై 2: లోక్‌సభను నిరవధిక వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా మంగళవారం ప్రకటించారు. 18వ లోక్‌సభ మొదటి సమావేశాలు జూన్ 24న ప్రారంభమయ్యాయి. 34 గంటల పాటు సమావేశం జరిగింది. 539 మంది లోక్‌సభ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. జూన్ 26న స్పీకర్‌గా ఓం బిర్లా ఎన్నికయ్యారు. 27న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన 18 గంటల పాటు జరిగిన చర్చలో 68 మంది సభ్యులు పాల్గొన్నారు.

80 స్థానాల్లో గెలిచినా.. ఈవీఎంలను నమ్మను

లోక్‌సభలో అఖిలేశ్ యాదవ్

న్యూఢిల్లీ: యూపీలోని మొత్తం 80 లోక్‌సభ స్థానాల్ని తాము గెలుచుకున్నప్పటికీ, ఈవీఎంలను విశ్వసించబోనని సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో కేంద్ర ఎన్నికల సంఘం నిష్పాక్షికతను లోక్‌సభలో ఆయన లేవనెత్తారు. మంగళవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే, ఈవీఎంల వాడకానికి ముగింపు పలుకుతామన్నారు. 'ఈసీ కొందరికి అనుకూలంగా వ్యవహరించింది' అని అఖిలేశ్ అన్నారు.

విమానంలో కుదుపులు.. ఓవర్‌హెడ్ బిన్‌లో ఇరుక్కున్న ప్రయాణికుడు

న్యూఢిల్లీ: విమాన ప్రయాణాల్లో భయానక పరిస్థితులు ప్రయాణికుల్ని వెంటాడుతున్నాయి. స్పెయిన్ నుంచి ఉరుగ్వేకు బయల్దేరిన విమానంలో ఒక్కసారిగా కుదుపులు రావటంతో ప్రయాణికులంతా సీట్ల నుంచి ఎగిరిపడ్డారు. ఒక వ్యక్తి ఏకంగా ఓవర్‌హెడ్ లగేజ్ కంపార్ట్‌మెంట్ వద్ద ఇరుక్కుపోయాడు. మిగతా ప్రయాణికులు అతడిని కిందికి దించుతున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. సోమవారం నాటి ఈ ఘటనలో కనీసం 40మందికి పైగా గాయపడ్డారని మీడియా తాజాగా పేర్కొన్నది.

గతంలో జరిగిన తొక్కిసలాట ఘటనలు

న్యూఢిల్లీ, జూలై 2: ఉత్తరప్రదేశ్ హాథ్రస్ జిల్లాలో తాజాగా చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన దేశ ప్రజల్ని షాక్‌కు గురిచేసింది. మృతుల సంఖ్య 100 దాటే అవకాశముంది. భారత్‌లో ఇటీవల కాలంలో చోటుచేసుకున్న ఘటనలు ఇవి..

- **2005:** మహారాష్ట్రలోని మంధారదేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 340మందికిపైగా మృతి.
- **2023 మార్చి 31:** ఇండోర్‌లో ఓ ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పురాతన బావిపై నిర్మించిన స్లాబ్ కూలిపోవటంతో 36 మంది చనిపోయారు.
- **2015 జూలై 14:** రాజమండ్రి వద్ద గోదావరి పుష్కరాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. 27మంది భక్తులు చనిపోయారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు.
- **2014 అక్టోబర్ 3:** పట్నాలోని గాంధీ మైదాన్‌లో చేపట్టిన దసరా ముగింపు వేడుకల్లో తొక్కిసలాట జరిగి 32మంది చనిపోయారు.
- **2013 అక్టోబర్ 13:** మధ్యప్రదేశ్ దాటియా జిల్లాలో రతన్‌గఢ్ ఆలయానికి సమీపంలో తొక్కిసలాట జరిగి 115 మంది చనిపోయారు.
- **2011 జనవరి 14:** కేరళ ఇడుక్కి జిల్లాలో ఓ జీపు శబరిమల యాత్రికులపైకి దూసుకెళ్లగా, తొక్కిసలాటకు దారితీసింది. ఈ ఘటనలో 104 మంది భక్తులు చనిపోయారు.
- **2010 మార్చి 4:** యూపీ ప్రతాప్‌గఢ్ జిల్లాలో రామ్‌జానకి ఆలయం వద్ద ఆహారం, దుస్తుల పంపిణీ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జనం ఎగబడ్డారు. తొక్కిసలాటలో 63 మంది చనిపోయారు.
- **2008 సెప్టెంబర్ 30:** రాజస్థాన్ జోధ్‌పూర్ నగరంలో చాముండా దేవి ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాటలో 250 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు.
- **2008 ఆగస్టు 3:** హిమాచల్ ప్రదేశ్ బిలాస్‌పూర్‌లోని నైనా దేవి ఆలయం వద్ద తొక్కిసలాట ఘటనలో 162 మంది చనిపోయారు.
- **2003 ఆగస్టు 27:** నాసిక్ జిల్లాలో జరిగిన కుంభమేళాలో తొక్కిసలాట వల్ల 39 మంది మృత్యువాత పడ్డారు.

లోక్‌సభలో రచ్చ రచ్చ

- మోదీ ప్రసంగం వేళ సభలో గందరగోళం
- మణిపూర్, నీట్ అంశాలపై విపక్ష ఎంపీల నిరసనలు
- 'నియంతృత్వం చెల్లదు' అంటూ నినాదాలు
- ప్రధాని ప్రసంగానికి అడ్డుపడిన ప్రతిపక్ష సభ్యులు
- నినాదాల హోరులోనే సాగిన మోదీ ప్రసంగం
- రాహుల్ గాంధీవి పిల్ల చేష్టలు అంటూ ఎద్దేవా

లోక్‌సభలో మాట్లాడుతున్న మోదీ

న్యూఢిల్లీ: లోక్‌సభలో మంగళవారం ప్రధాని మోదీ ప్రసంగిస్తున్న సమయంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్ష ఎంపీల నినాదాలతో సభ హోరెత్తింది. దీంతో నినాదాల మధ్యే ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించాల్సి వచ్చింది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మోదీ ప్రసంగించారు. ఆయన ప్రసంగానికి సిద్ధమవగానే ప్రతిపక్ష సభ్యులు 'మణిపూర్.. మణిపూర్', 'తానాషాహి నహీ చలేగీ(నియంతృత్వం చెల్లదు)' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్పీకర్ నిలువరించేందుకు ప్రయత్నించినా ఇండియా కూటమి సభ్యులు నిరసనను కొనసాగించారు. ఒకానొక దశలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై స్పీకర్ తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పరాన్నజీవి: మోదీ

కాంగ్రెస్ పారీపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టారని, మూడోసారి కూడా ఆ పార్టీ 100 సీట్ల మార్క్‌ను దాటలేకపోయిందని ఎద్దేవా చేశారు. 99 సీట్లు వచ్చాయని కాంగ్రెస్ నేతలు మిఠాయిలు పంచుకుంటున్నారని అన్నారు. ఆ పార్టీకి వందకు 99 రాలేదని, 543 సీట్లకు 99 వచ్చాయని గుర్తు చేశారు. వారి స్ట్రైక్ రేట్ కేవలం 26 శాతం మాత్రమేనని, ప్రజా తీర్పును ఇకనైనా గౌరవించాలని కాంగ్రెస్ ఎంపీలకు హితవు పలికారు. కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసిన చోట్ల ఎక్కువగా సీట్లు సాధించలేదని, పొత్తులతోనే ఎక్కువ స్థానాలు గెలిచిందని అన్నారు. పొత్తులో ఉన్న పార్టీల ఓట్లను తినేసే పరాన్న జీవిగా కాంగ్రెస్ మారిపోయిందని ఎద్దేవా చేశారు.

రాహుల్‌ది చిన్న పిల్లాడి ప్రవర్తన

సోమవారం రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు బదులిస్తూ..'నిన్న సభలో చిన్న పిల్లాడి ప్రవర్తనను చూశాం' అంటూ పరోక్షంగా ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ సానుభూతి పొందేందుకు డ్రామా చేస్తున్నారని విమర్శించారు. హిందూ సంస్కృతిని తిట్టడం ప్రతిపక్షానికి అలవాటుగా మారిందని, 'హిందూ ఉగ్రవాదం' అని పదాలను కాంగ్రెస్ పలికిందని, ఆ పార్టీ మిత్రపక్షాలు హిందుత్వాన్ని మలేరియాతో పోల్చాయని, దేశం వారిని ఎన్నటికీ క్షమించదని పేర్కొన్నారు.

పేపర్ లీక్‌లను అరికడతాం: మోదీ

పేపర్ లీక్‌లను అరికట్టేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నదని, యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్న వారిని వదిలిపెట్టబోమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

హిందువులకు క్షమాపణ చెప్పాలి: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): లోక్‌సభలో విద్వేషపూరిత ప్రసంగం చేసిన రాహుల్‌గాంధీ యావత్ హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. లోక్‌సభలో విపక్ష నేత హోదాలో చాలా బాధ్యతాయుతమైనదని, పేదల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. కానీ రాహుల్‌గాంధీ తన విద్వేషపూరిత ప్రసంగాలకు లోక్‌సభను వేదికగా వాడుకోవడం దురదృష్టకరమని వెల్లడించారు.

రాహుల్ వ్యాఖ్యలపై బన్సూరీ స్వరాజ్ నోటీసు

తన ప్రసంగంలో రాహుల్ గాంధీ తప్పులు మాట్లాడారని పేర్కొంటూ లోక్‌సభలో బీజేపీ ఎంపీ బన్సూరీ స్వరాజ్ మంగళవారం నోటీసు ఇచ్చారు. తన నోటీసును పరిగణనలోకి తీసుకోవాలని ఆమె స్పీకర్ ఓం బిర్లాను కోరారు. అగ్నిపథ్ పథకం గురించి అయోధ్యలో స్థానికులకు పరిహారం చెల్లింపుపై రాహుల్ గాంధీ అవాస్తవాలు మాట్లాడారని కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, కిరణ్ రిజిజు ఆరోపించారు.

రికార్డుల నుంచి రాహుల్ వ్యాఖ్యల తొలగింపు

సభలో నేను మాట్లాడింది వాస్తవాలే • మళ్లీ చేర్చాలని స్పీకర్‌కు రాహుల్ లేఖ

న్యూఢిల్లీ, జూలై 2: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా సోమవారం జరిగిన చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన పలు వ్యాఖ్యలను స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించారు. దీంతో ఈ నిర్ణయాన్ని తప్పుపడుతూ స్పీకర్‌కు మంగళవారం రాహుల్ గాంధీ లేఖ రాశారు. లోక్‌సభ 380 నిబంధనలో పేర్కొన్న అంశాలను మాత్రమే తొలగించాలని, తన వ్యాఖ్యలు ఈ నిబంధన కిందకు రాకపోయినా రికార్డుల నుంచి తొలగించారని రాహుల్ ఆరోపించారు. తన వ్యాఖ్యలు తొలగించడం పార్లమెంటరీ ప్రజాస్వామ్య నిబంధనలకు వ్యతిరేకమని ఆరోపించారు. మరోవైపు బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ప్రసంగంలో మాత్రం కేవలం ఒకే ఒక్క పదాన్ని మాత్రమే తొలగించడం చూసి ఆశ్చర్యపోయానని పేర్కొన్నారు. రికార్డుల నుంచి తొలగించిన తన ప్రసంగాన్ని తిరిగి చేర్చాలని స్పీకర్‌ను కోరారు.

రాహుల్‌లా ప్రవర్తించకండి

ఎన్డీయే ఎంపీలకు మోదీ సూచన

న్యూఢిల్లీ, జూలై 2: కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలా ప్రవర్తించవద్దని ఎన్డీయే ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. మంగళవారం ఎన్డీయే ఎంపీలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఒక కాంగ్రేసేతర నేత, అదీ ఒక చాయ్‌వాలా వరుసగా మూడోసారి ప్రధానమంత్రి కావడంతో ప్రతిపక్షం కలత చెందిందని మోదీ పేర్కొన్నారు. ఏదైనా అంశంపై మీడియాతో మాట్లాడే ముందు దానిపై పూర్తిగా అధ్యయనం చేయాలని ఆయన ఎంపీలకు సూచించారు.

నేను మాట్లాడింది సత్యం

క్షమాపణకు రాహుల్ నిరాకరణ

న్యూఢిల్లీ, జూలై 2: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీపై తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు కోరేందుకు విపక్ష నేత రాహుల్ గాంధీ నిరాకరించారు. 'నేను ఏదైతే మాట్లాడాలో అదే మాట్లాడాను. నేను మాట్లాడింది సత్యం. వారికి ఎంత కావాలో అంత తొలగించుకోవచ్చు కానీ సత్యమే గెలుస్తుంది.' అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రపంచంలో సత్యాన్ని తొలగించవచ్చని, కానీ వాస్తవంలో మాత్రం తొలగించలేరని రాహుల్ పేర్కొన్నారు.

పరీక్షకు 2 గంటల ముందు ప్రశ్నపత్రం ఖరారు

నీట్ పీజీపై కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, జూలై 2: నీట్ యూజీ-2024 పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా వివాదం నెలకొనటంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నది. నీట్ పీజీ పరీక్షకు రెండు గంటల ముందు మాత్రమే ప్రశ్నపత్రాన్ని ఫైనల్ చేయాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ నెలాఖరులో లేదా ఆగస్టులో నీట్ పీజీ పరీక్ష ఉండొచ్చని తెలుస్తున్నది. రివైజ్డ్ షెడ్యూల్‌ను జూలై 2న ప్రకటిస్తారని వార్తలు వచ్చాయి. కానీ, మంగళవారం అలాంటి ప్రకటనలేవీ రాలేదు. కేంద్రం నుంచి ఆమోదం వచ్చాకే నిర్ణయం తీసుకోవాలని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

జూలై 8న సుప్రీంకోర్టు విచారణ

నీట్ -యూజీ 2024లో అక్రమాలు చోటుచేసుకున్నందున పరీక్షను రద్దు చేయాలని, అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ దాఖలైన 26 పిటిషన్లను ఈ నెల 8న విచారించనున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది. నీట్ అక్రమాలపై గత నెల 11న విచారించిన సుప్రీంకోర్టు.. నీట్-యూజీ పరీక్ష పవిత్రత దెబ్బతిన్నదని వ్యాఖ్యానించింది. దీనిపై స్పందన తెలియజేయాలంటూ కేంద్రానికి, పరీక్ష నిర్వహించిన ఎన్‌టీఏను ఆదేశించింది. అయితే కౌన్సిలింగ్ ప్రక్రియ నిలిపివేయడానికి కోర్టు నిరాకరించింది.

నూతన న్యాయ చట్టాలపై 'నో కామెంట్'

స్పందించేందుకు నిరాకరించిన సీజేఐ

న్యూఢిల్లీ, జూలై 2: దేశంలో సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన 3 కొత్త క్రిమినల్ చట్టాల గురించి మాట్లాడేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నిరాకరించారు. ముమ్మందు ఈ అంశం న్యాయ పరిధిలో ఉంటుందని చెప్పారు. ఢిల్లీలోని కర్కడూమ, శాస్త్రి పార్క్, రోహిణిలో దిగువ కోర్టు భవన నిర్మాణాలకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొత్త క్రిమినల్ చట్టాల అమలుపై అడిగిన ఓ ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. 'నేను ఇక్కడికి వచ్చిన పనికి, కొత్త క్రిమినల్ చట్టాలకు సంబంధం లేదు. ఇవి సుప్రీంకోర్టుతోపాటు ఇతర హైకోర్టుల పరిధిలోకి రాబోతున్న సమస్యలని మీకు తెలుసు. కోర్టుల ముందుకు వచ్చే అవకాశం ఉన్న ఏ అంశంపైనా నేను మాట్లాడకూడదు' అని స్పష్టం చేశారు. ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ సైతం ఇదే విధంగా స్పందించారు. ఈ చట్టాలకు సంబంధించిన అనేక కేసులు తన ముందుకు వచ్చే అవకాశం ఉన్నందున వాటి గురించి మాట్లాడటం సరికాదన్నారు.

వాతావరణ మార్పులను విస్మరించకూడదు

ఢిల్లీలో ఇటీవల ఎండలు మండిపోవడం, ఆ వెంటనే భారీ వర్షం కురవడంపై జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పులను ఎవరూ విస్మరించకూడదని, కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ హరిత జీవన విధానాన్ని (గ్రీన్ లైఫ్‌స్టైల్‌ను) అలవర్చుకోవాల్సిన అవసరం ఉన్నదని ఉద్ఘాటించారు. ఈ ఏడాది ఢిల్లీలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, ఒకే రోజు తీవ్రమైన వడగాడ్పులను, రికార్డు స్థాయి భారీ వర్షాన్ని చవిచూడాల్సి వచ్చిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో వాతావరణ మార్పులను ఎవరూ విస్మరించడానికి వీల్లేదని పేర్కొంటూ.. మన మౌలిక వసతులు మన వాస్తవిక జీవనాన్ని ప్రతిబింబించేలా ఉండాలని స్పష్టం చేశారు.

11 మంది నక్సల్స్ మృతి!

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

కొత్తగూడెం క్రైం, జూలై 2: మావోయిస్టులు, భద్రతా బలగాలకు మ